విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఉపాధితో వందరోజుల పని కల్పించాలి

విశాలాంధ్ర-కూచిపూడి: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి జాబు హోల్డర్‌కు సంవత్సరానికి 100 రోజులు పని దినాలు కల్పించాలని కోరుతూ శనివారం మొవ్వ మండలంలోని బార్లపూడి, పాలంకిపాడు, కొండవరం సచివాలయాలలో ఉపాధి హామీ కార్మికులు, మేట్లు వినతి పత్రాలు అందజేశారు. అదేవిధంగా రోజువారి వేతనమే రూ.600కు పెంచాలంటూ డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న మచిలీపట్నంలో జరిగే కలెక్టరేట్ రాయబారానికి కూలీలందరూ తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శీలం నారాయణరావు అవగాహన కల్పించి చైతన్యపరిచారు.

ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

విశాలాంధ్ర-కూచిపూడి: రాజమహేంద్రవరంలో నిర్వహించే మహానాడు దిగ్విజయంగా కొనసాగాలని, ఎన్టీఆర్ శతజయంతి పండగ వాతావరణంలో జరగాలని ఆకాంక్షిస్తూ మొవ్వ మండలంలోని పెదపూడిలో టీడీపీ పతాకాన్ని ఎగరవేసి కేక్ కట్ చేసి ప్రసంగాలు నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నేత తాతనేని పూర్ణచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు వీరంకి తులసీదాసు, మురారి పూర్ణచంద్రరావు, తాతా సత్యనారాయణ, వెంపటి గోపాల్ కృష్ణ, తాతా శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి పెదపూడి సెంటర్ పసుపు జెండాల తోరణాలతో అలంకరించారు.

మహానాడులో గూడూరు నాయకులతో కాగిత

విశాలాంధ్ర-గూడూరు: టీడీపీ రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడులో పెడన టీడీపీ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. మహానాడు వెళ్లిన గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, పార్టీ నాయకులు గోపీ నాగబాబు, ఎస్ఏ బేగ్, కట్ట మునేశ్వర్ రావు, బొర్రా శ్రీనివాసరావు, పోతుల రాము, తమ్మన శ్రీనివాసరావు, లుక్కా ఎలేష్, గొరిపర్తి చంద్రశేఖర్ కృష్ణప్రసాద్‌ను కలసుకుని ఫొటో దిగారు.

మహానాడుకు వెళ్లిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పెదపారుపూడి: రాజమహేంద్రవరంలో జరుగు తున్న మహానాడుకు టీడీపీ పామర్రు ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ విభాగం నాయకులు కలపాల కిషోర్ నాయకత్వంలో టీడీపీ మండల నాయకులు వెళ్లినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-పెదపారుపూడి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండా రాలని, వేసవి సెల వులలో విద్యా ర్థులు సమయం వృథా చేయ కుండా, ఎండలో బయట తిరగ కుండా, గ్రంథాలయంలో రోజు జరిగే ఉచిత శిక్షణలో పాల్గొని విజ్ఞానానికి కావాల్సిన బుక్స్ అనేకం అందుబాటులో ఉన్న వాటిని ఉపయోగిం చుకోవాలని గ్రంథాలయ పాలకు రాలు ఎన్‌వీఎస్ లక్ష్మి శనివారం విద్యార్థులకు ఉద్బోధించారు. విద్యార్థి దశలోనే ఆ రోజులలో అనేకమంది పుస్తక పఠనం చేసి ఈ రోజున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా పేరు గడించారని, అలాగే అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్ లుగా ఉద్యోగాలలో స్థిరపడ్డారని గుర్తిస్తూ అటువంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకుని చదువులలో రాణించాలని విద్యార్థులకు హితవు పలికారు. అనంతరం బృంద చర్చ అనే అంశంపై, కొన్ని రకాల ఆటలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గోరక్షణకు రూ.13 వేల విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: ఖమ్మం జిల్లా, బోనకల్లు మండలం, ఎల్ గోవిందపురం వాస్తవ్యులు ధర్మపురి నరసింహారావు-లక్ష్మీ దంపతులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి గోశాలలోని గో సంరక్షణకు రూ.13 వేలు విరాళంగా ఇచ్చారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు. ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, ప్రధాన అర్చకులు మర్రేబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వెండి తాపడానికి రూ.10వేల విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానములోని శ్రీ అంకమ్మ అమ్మవారి దేవాలయం వెండి తాపడం నిమిత్తం శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ చెన్న కేశవరావు-విజయలక్ష్మి దంపతులు, కాకాని వెంకమ్మ జ్ఞాపకార్థం రూ.పదివేల ఒక్క రూపాయలు విరాళం ప్రకటించారు. దీనిని ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన వెంకటరమణ, ఆలయ అధికారులకు అందజేశారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గంపలగూడెం: పెద్దకొమెర లేఅవుట్‌లో పట్టా పొందిన, ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకొనుటకు ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ డీ కిషోర్, పంచాయతీ కార్యదర్శి గోగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నాడు నేడు రెండోదశలో మంజూరైన తరగతి గదుల నిర్మాణాలను ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి పరిశీలించారు. జూన్ 9వ కల్లా తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ కె.వెంకటలక్ష్మిని ఆదేశించారు.

బావిలో జారిపడి విద్యార్థి మృతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన పదోతరగతి చదువుతున్న విద్యార్థి తోటమాల చంద్రశేఖర్ (16) పొలాల్లో క్రికెట్ ఆడుతూ, బంతి తీసుకొచ్చేందుకు సమీపంలోని బావి వద్దకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి దుర్మరణం మృతి చెందాడు. ఈ ఘటనతో తల్లిదండ్రులు, బంధువులు శోక సముద్రంలో మునిగి పోయారు.

ఎండార్స్‌మెంట్ ఇవ్వని వారిపై చర్యలు

విశాలాంధ్ర-మచిలీపట్నం: జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల పరిష్కారంలో సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల పరిష్కారం, పేదలందరికీ ఇళ్లు రీ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో 83 మళ్లీ వచ్చిన అర్జీలు ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకసారి పరిష్కరించబడిన అర్జీ మళ్లీ వచ్చిందంటే జిల్లాస్థాయిలో దానిని తీవ్రంగా పరిగణించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అటువంటి అర్జీలను పరిశీలించి సంబంధిత గ్రామ కార్యదర్శులు, ఈవోపీఆర్ ఆర్డీలు తదితర సిబ్బందితో కలసి అర్జీదారుల గ్రామాలకు వెళ్లి వారితో మాట్లాడాలన్నారు. అర్జీదారులు అర్జీలలో ఏమి కోరారని, అధికారులు ఏమి ఎండార్స్‌మెంట్ ఇచ్చారో, అది సరైనదా కాదా ఒకసారి గమనించాలన్నారు. జిల్లా యంత్రాంగం అంతా కదిలి వచ్చి పరిష్కరించింది అనే భావన అర్జీదారుల్లో కలిగి వారిలో సంతృప్త స్థాయి పెంపొందేలా కృషి చేయాలన్నారు. అర్జీదారులకు సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వక నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు చేపట్టేందుకు షోకాజ్ మెమో గాని, హెచ్చరికలు గాని జారీ చేయాలన్నారు. అసలు ఎండార్స్‌మెంట్ ఏ విధంగా ఇవ్వాలో సరైన అవగాహన కూడా సంబంధిత అధికారులకు కలిగించాలన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు ఏమిటో జిల్లా అధికారులు గమనించి అందుకు అనుగుణంగా అర్జీదారుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేయాలన్నారు.

సమస్య పరిష్కారం అయ్యాక సంబంధిత అర్జీదారులతో ఫోటో తీసి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా అధికారుల స్థాయిలో పరిష్కారం కానీ అర్జీల వివరాలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు తదితర క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శన

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలోని పెదపూడి జగనన్న లేఅవుట్‌లో వసతుల కల్పనపై జగనన్నకు చెబుదాంలో చేసిన ఫిర్యాదు పై శనివారం పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఆ కాలనీకి వచ్చి సమస్యలపై ఆరా తీశారు. ఆ లే అవుట్ మాగాణి పొలాల్లో ఇవ్వడంతో వర్షాకాలంలో కాలనీ నీట మునుగుతోందని, అంతర్గత రహదారులు లేవని, విద్యుత్ సౌకర్యం లేదని, దీనితో లక్షలాది రూపాయలు ఇల్లు కట్టుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని వచ్చిన అధికారులకు లబ్ధిదారులు పేర్కొన్నారు. దీనితో స్పందించిన అధికారులు త్వరలో మెరకజేసి రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, డీఈ శ్రీనివాసరావు, కూచిపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తాతా రాంబాబు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆల్ ఫ్రెడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం అయ్యంకిలో పంచాయతీ సర్పంచ్ నిర్వహిస్తున్న చెరువులో మట్టి తవ్వకాల పనులను గ్రామస్తులు శనివారం అడ్డుకోవడంతో పనులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. గ్రామంలో జగనన్న లేఅవుట్లకు మెరక చేయటం కోసం పంచాయతీలో తీర్మానం చేసి, తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నాగన్న బోయిన సునీల్ కుమార్ పేర్కొన్నారు. అయితే అదే సమయంలో గ్రామస్తులు సైతం తమ ఇళ్ల వద్ద మేరకు చేసుకోవడానికి కోరటంతో ట్రక్కు రూ.600 చొప్పున తోలుతున్నారని గ్రామస్తులు అడ్డగించారన్నారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త, అధికార పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు మాట్లాడుతూ జగనన్న కాలనీ మెరక కోసం చేసిన తీర్మానాన్ని అడ్డం పెట్టుకొని బయటకి ట్రక్కు వేయి రూపాయల చొప్పున మట్టి అమ్ముతున్నారని దీనితో అడ్డుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్వో సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ గ్రామస్థుల సమాచారంతో అక్కడకు వచ్చి, రెండు వర్గాలతో మాట్లాడి మట్టి తవ్వకం పనులను నిలిపి వేయించారు.

అధిక లోడు వాహనాలతో ఇబ్బందులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మంటాడ-లంకపల్లి రహదారి పై ఇసుక లారీలు విపరీతమైన శబ్దాలతో తెల్లవార్లు తిరుగుతున్నాయని, ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళనలతో బతకాల్సి వస్తోందని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇసుక లారీలు అధిక లోడుతో విపరీతమైన హారన్‌లతో, లారీల రద్దీతో ఓ వైపు నిద్దుర లేక మరోవైపు దుమ్ము ధూళి భరించ లేకపోతున్నామని, రాత్రి సమయాల్లో కూడా పరిస్థితి యథాతథంగా ఉండటంతో చోరగుడి, కృష్ణాపురం, పమిడిముక్కల, వీరంకిలాకు కపిలేశ్వ రపురం గ్రామ ప్రజలు నిద్దుర లేక నానా ఇబ్బం దులు పడుతున్నామని వాటిని వెంటనే నియంత్రిం చాలని కోరుతున్నారు. ఇసుక క్వారీలు సాయం త్రం ఆరు గంటలకు మూసి వేయాల్సి ఉండగా తెల్లవార్లు పనిచేయడంపై ఇటు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇసుక లారీ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పౌష్టిక ఆహారంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

విశాలాంధ్ర-ఘంటసాల: పౌష్టిక ఆహారమును తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు అని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి .కృష్ణ వేణి తెలిపారు. శనివారం ఘంటసాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక గ్రంథాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయ అధికారి ఎం శరత్ కుమార్ అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు, సస్య పోషణ శాస్త్రవేత్త కృష్ణకుమారి మాట్లాడుతూ కొర్రలు, సామలు, ఊదలు వంటి మిల్లెట్స్ వాడకాన్ని ఆహారంలో అలవాటు చేసుకోవాలన్నారు. రాగి జావ వాడకం వల్ల ఆరోగ్యరీత్యా ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బి. నవీన్, ఎం.మంజువాణి, కె. రేవతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వేసవిలో పలు రకాల సీజనల్ ఫ్రూట్స్ తినడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, పప్పుధాన్యాలను వినియోగించడం వల్ల విటమిన్‌లతో పాటు ప్రోటీన్లు లభిస్తాయని తెలిపారు. పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వాడకం వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయన్నారు. వీటి వాడకాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. పలు పాఠ్యాంశాలను వారు చదివించారు. ఫైవ్‌స్టార్ ,కిట్ క్యాట్ వంటి పలు రకాల చాక్లెట్లను కేవీకే ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థినీ విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్, చెస్, ఆటలు పోటీలను నిర్వహించారు.

డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలం, కీసర గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ డ్రైనేజ్ ల నిర్మాణ పనులకు శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన ప్రజలకు సేవ చేయాలనే చిత్తశుద్ధితో ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మౌలిక వసతుల కల్పనకు వైయస్ జగన్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు హయంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పారు .ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ పేరం నర్సమ్మ, ఎంపీపీ షేక్ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి రమేష్, నాయకులు పరిటాల రామ కోటేశ్వర రావు, ఉప సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్పందించిన ప్రభుత్వం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: ఎప్పటినుండో కొండపల్లి పరిసర ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న జూనియర్ కళాశాల ఏర్పాటు కల నెరవేరిందని బొర్రా కిరణ్ అన్నారు. ఈనెల రెండో వారంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావుకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్.టి.ఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కొండపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బొర్రా కిరణ్ మాట్లాడుతూ, అధిక జనాభా, విద్యార్థులు కల్గిన కొండపల్లిలో ఇప్పటి వరకు జూనియర్ కళాశాల లేకపోవడం మన దురదృష్టమని, ఇప్పటికీయనా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా జూనియర్ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుండే ఏర్పాటు చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వడం, బోధన సిబ్బందిని నియమించటం అభినందనీయమన్నారు. కొండపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి కళాశాలల తరగతులు పరిశీలించామని, అక్కడ వున్న సిబ్బందితో మాట్లాడి జూనియర్ కళాశాల ఏర్పాటుపై ఈ విద్యా సంవత్సరం నుండే తరగతులు ప్రారంభం అవుతాయి అనే ప్రచారం విస్తృతంగా చేయవలసిన అవసరం సిబ్బందికి సూచించామన్నారు. పీసీసీ కార్యదర్శిపోతురాజు ఏసుదాస్, చెరుకు ఆనందరావు, రాగాల రాము పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు మాన్యువల్‌గా నిర్వహించాలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రస్తుతం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతులు ఆన్లైన్ విధానం ద్వారా కాకుండా మాన్యువల్ గా నిర్వహించాలని ఎస్టీయూఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్యక్షులు వేముల బిక్షమయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పదోన్నతులకు ముందుగా ఖాళీలను చూపకుండా ఉపాధ్యాయులను విల్లింగ్/అన్విల్లింగ్ తెలియజేయమనటం అశాస్త్రీయమైన విధానమని విమర్శించారు. గతంలో రూ.2500/- ఇస్తామని అన్ని సబ్జెక్టు ఉపాధ్యాయులచే బోధన చేయించుకొని వారికి ఇప్పటికీ కూడా ఆ డబ్బులను ఇవ్వకుండా వారి ప్రమోషన్స్ క్యాన్సిల్ చేయటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలలో ఉపాధ్యాయ ఖాళీలను ఏ ఒక్కటి కూడా బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలను చూపాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ముగిసినందున ఏ ఒక్క ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా అప్లికేషన్లను స్క్రూట్నీ చేసి న్యాయబద్ధంగా వారికి రావలసిన పాయింట్లు కేటాయించాలని కోరారు. 5 హైస్కూల్ ప్లస్ లో పనిచేసిన ఉపాధ్యాయుల కు చెల్లించవలసిన 2,500/- రూపాయలను కూడా వారికి ఇంత వరకు చెల్లించలేదని ,ఆ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పుస్తక పఠనాశక్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : పుస్తకపఠనాశక్తిని పెంపొందించుకోవాలని రిటైర్డ్ గ్రంథాలయ అధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలు ముదినేపల్లి గ్రేడ్ 3 శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర మహాభారతంలో శ్రీకృష్ణ రాయబారం పద్యాలు విద్యార్థులను అలరింపజేశాయి. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బోధించారు. విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించారు. గ్రంథాలయ అధికారిణి ఎం. శ్రీదేవి, స్పోకెన్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు జె. బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రెస్ వాహనాల జోరు

విశాలాంధ్ర-మండవల్లి: వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలి హెల్మెట్టు విధిగా ధరించాలి. పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలి అనే మాటలు పోలీసు శాఖ నుండి తరుచు వింటుంటాం. బిజీ జీవితంలో వాహనాల వినియోగం పెరిగి ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవు తుండటంతో పాటు రహదారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సాధారణ పౌరుల సంగతి ఎలా ఉన్న నియోజకవర్గంలోను, మండవల్లి మండలంలోను ప్రెస్‌అనే పేరుతో వాహనాలు రోడ్లపై భారీగానే కానవస్తున్నాయి .ప్రెస్ పేరుతో ఉన్న ద్విచక్రవాహనాల్లో కొన్ని నెంబరు ప్లేట్లు లేకుండానే తిరుగే స్తున్నాయి. గతంలోనే విలేకర్లకు గుర్తింపుగా ఇచ్చే అక్రిడిటేషన్ కార్డుల్లో నిబంధనలు ప్రభుత్వం కఠినతరం చేయగా ఎక్కువ మంది విలేకర్లుగా చెప్పు కుంటున్న వారికి ఆ కార్డులు లేవనే వ్యాఖ్యానాలు వినవస్తుంటాయి. కరోనా మహమ్మారి విపత్కర పరిస్థితుల తరువాత రోజు వారి ప్రింట్ అయి, పాఠకులకు చేరే పత్రికలు వేళ్లపై లెక్కించే సంఖ్యలోనే ఉంటున్నాయి. అసలు నిజమైన జర్నలిస్టులు ఎవరు, కానివారెవ్వరో తెలియని సందిగ్ధంలో అధికా రులు ,ప్రజలు ఉండగా ప్రెస్‌వాహనాలతో రక్షక సిబ్బందిని సైతం వీరు బురిడి కొట్టించేస్తున్నారు.

కరుణాపీఠంలో అన్నదానం

విశాలాంధ్ర-గుడివాడ: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరుకు చెందిన తాతా శివరాం యాదవ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం కరుణాపీఠంలోని వృద్ధులకు అన్నదానం, నెలకు సరిపడా సరుకులు పంపిణీ కార్యక్రమం చేశారు. యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరి కుమార్, ఆర్యవైశ్య ప్రముఖులు తిరుపతయ్య, లయన్స్ క్లబ్ ఉమ్మడి కృష్ణాజిల్లా కన్వీనర్ యలమర్తి కృష్ణారావు, ఆర్కే ఫౌండేషన్ అధ్యక్షులు కొల్లాబత్తుల రామకృష్ణ, యాదవ సంఘం నాయకులు మాకుల సత్యం పాల్గొన్నారు.

రసాయనాల మామిడిపండ్లు హానికరం

విశాలాంధ్ర-గుడివాడ: మామిడి పండ్లను రసాయనాల ద్వారా పండిస్తున్నారని, అవి తినడం వల్ల ఆరోగ్యానికి హానికరం కలిగించే బ్యాక్టీరియాతో రోగాల బారిన పడతారని భవిష్యత్ భద్రత దళం వ్యవస్థాపకులు వైవీ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికి వారే స్వయంగా ఇంట్లోనే మామిడి కాయలను పండించుకుని తినడం ఆరోగ్యానికి శ్రేయోస్కరమని పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో రాజదండన ప్రతిష్ఠ సరికాదు

విశాలాంధ్ర-గుడివాడ: గత ప్రభుత్వాలు మతతత్వ శక్తులకు అడ్డుకట్ట వేస్తే నేటి బీజేపీ ప్రభుత్వం మతతత్వాలను ప్రోత్సహించే విధంగా పరిపాలన సాగిస్తుండటం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి మండిపడ్డారు. శనివారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మత గురువులకు ఇచ్చే రాజదండన పార్లమెంట్ భవనంలో ప్రతిష్టించడం సరికాదన్నారు. కరోనా తర్వాత దేశం ఆర్థిక సంక్షోభంలో కూరికిపోయిందని, ఇటువంటి సమయంలో కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి పార్లమెంట్ భవనాన్ని నిర్మించడం అవసరమా అని ఆయన ప్రశ్నించారు.

వీకేర్ కాలేజీ విద్యార్థుల అ'పూర్వ' సంగమం

విశాలాంధ్ర-గన్నవరం: వీకేర్ కళాశాల 1976, 77 బీఏ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన విక్టర్ బాబు ఇంట్లో శనివారం జరిగింది. ఆ ఏడాది బీఏ చదివిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. గురువులను విద్యార్థులు శాలువా, నూతన వస్త్రాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ప్రపంచాన్ని మార్చగలగే శక్తి విద్యకుంది

విశాలాంధ్ర-ఘంటసాల: ఈ ప్రపంచాన్ని మార్చగలిగేది ఒక విద్య మాత్రమేనని ఆ విద్యను ఎవరు అశ్రద్ధ చేయవద్దని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్ పేర్కొన్నారు. మండలంలోని కొడాలి శాఖ గ్రంథాలయంలో, గ్రంథాలయ అధికారి ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కైతేపల్లి దాస్ పాల్గొని ప్రసంగిస్తూ విద్యతోనే సమూల మార్పు సాధించవచ్చని ప్రతి విద్యార్థి విద్యను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రతి ఒక్కరు ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులకు కథలు చెప్పించడం చిత్రలేఖనం వేయించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రామాల్లో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డి.పి.ఓ. ఎస్.వి.ఆర్. నాగేశ్వర్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం పమిడిముక్కల పంచాయతీ పరిధిలోని ఎస్.టి.ఆర్ కాలనీ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని పలుమార్లు స్పందన కార్యక్రమంలో, వాట్సాప్ గ్రూప్‌లలో రావడంపై స్పందించిన జిల్లా అధికారులు సదరు కాలనీలో పర్యటించారు. సమస్యకు పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడే కాకుండా ఇతర గ్రామాల్లో కూడా ఇలాంటి సమస్యలు ఉంటాయని వెంటనే పరిష్కరించాలని సమస్యలు పెద్దవి చేయవద్దని సూచించారు. డి.ఎల్.పి.ఓ. సంపత్ కుమారి, ఈవోపీఆర్డి విజయ కుమార్ సర్పంచ్ యం.సునీత కార్యదర్శి పి.వి.రమణ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్ట్

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం అయ్యంకి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ కంపెనీకి చెందిన ఇనప గడ్డర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 24న అపహరించినట్టు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పామర్రు సీఐ ఎన్ వెంకట్ నారాయణ శనివారం తెలిపారు. కూచిపూడి ఎస్సై డి సందీప్ బృందం అయ్యంకి అడ్డరోడ్డు వద్ద వీటిని తరలిస్తున్న వాహనంతో పాటు ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు గుడివాడలోనే పంచవత్తుల కాలనీకి చెందిన వారుగా గుర్తించామని ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో కాకుండా పామర్రు, పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా చోరీచేసిన రెండున్నర లక్షల రూపాయలు విలువగల ఐరన్, వాటిని తరలించడానికి వినియోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. కాగా ఈ కేసులో ప్రతిభకనబరిచిన కూచిపూడి ఎస్సై డి సందీప్ బృందాన్ని పామర్రు వెంకటనారాయణ అభినందించారు.

'అటవీ హక్కుల చట్టం' అమలుకు పోరు

విశాలాంధ్ర-విజయవాడ: అటవీ సంపద అభివృద్ధి, పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బలహీన వర్గాలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు జరిపించుకునేందుకు పేదలంతా పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో కె.తాడేపల్లి వనసంరక్షణ సమితి చైర్‌పర్సన్ కంపా లక్ష్మయ్య అధ్యక్షతన శనివారం జరిగిన భూపోరాట కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వ్యవసాయాధారిత దేశంలో ప్రతి పేద వానికీ వ్యవసాయ భూమి దక్కినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని కోటేశ్వరరావు అన్నారు. ఈ లక్ష్యంతోనే సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు దున్నే వానికే భూమి దక్కాలనే నినాదంతో ఐదు దశాబ్దాలుగా ప్రత్యక్ష భూ ఆక్రమణోద్యమాలను నిర్వహించాయని పేర్కొన్నారు. ఇంకా ఈ పోరాటాలు సాగుతూనే ఉన్నాయని వివరించారు. సాగుదారులకు పట్టాలిచ్చేందుకు పాలకులు దశాబ్దాల తరపడి పట్టించుకోవడం లేదన్నారు. భూమి కోసం ఏ విధంగా వీరోచితంగా పోరాడుతున్నామో పట్టాల కోసం రెట్టింపు పట్టుదలతో ఉద్యమాలకు సన్నద్ధమై సాధించుకోవాలని వివరించారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు పర్చడంలో అటవీశాఖ ఏ మాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. అటవీ హక్కుల పట్టాలను సాధించుకోవటానికి ఉధృతమైన ఉద్యమాలకు సాగుదార్లు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉప్పె నరసింహారావు, భూక్యా దేశ్యా, ఇస్లావతు సాంబయ్య, ఇండ్ల లక్ష్మీ నారాయణ, కుంచం లింగయ్య, తుపాకుల రాయప్ప, ఇస్లావతు దుర్గారావు ఈ సమావేశంలో భూ సమస్యలపై ప్రసంగించారు.

బాలికోన్నత పాఠశాలలో ఇంటర్ అడ్మిషన్లు

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరంలో భాగంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం నాగకుమారి తెలిపారు. ఇంటర్మీడియట్ బోధనకు అవసరమైన పిజిటి ఉపాధ్యాయుల నియామకం కూడా జరిగిందని, ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల మేరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలియజేశారు. వివరాలకు తమ పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సింగ్‌నగర్‌లో రెండో ఫ్లైఓవర్ నిర్మించాలి

విశాలాంధ్ర-విజయవాడరూరల్: సింగ్‌నగర్‌లో రెండో ఫ్లైఓవర్ నిర్మించాలని, ట్రాఫిక్ సమస్యల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ నగర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ జీ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు అధ్యక్షతన నిరసన నిర్వహించారు. గడచిన 25 ఏళ్లలో సింగ్‌నగర్ బాగా అభివృద్ధి చెందిందనీ, నగరం నుంచి సింగ్‌నగర్ వైపు లక్షలాది మంది ప్రజలు ప్రస్తుతం ఉన్న ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణిస్తున్నారని, ఈ ట్రాఫిక్ కారణంగా పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కోటేశ్వరరావు తెలిపారు. ఈ కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు నిర్ణీత సమయానికి తమ గమ్యానికి చేరుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు సత్యనారాయణ థియేటర్ వద్ద రైల్ గేట్ ఉండేదని, బయట ప్రాంతంలోని ప్రజలు అజిత్‌సింగ్‌నగర్, నున్న, నూజివీడు వెళ్లాలన్నా ఈ రైలుగేట్ వద్ద గంటల తరబడి ఇబ్బందులు పడతున్న నేపథ్యంలో ఆనాడు, ఈ ప్రాంతం పశ్చిమ నియోజకవర్గంలో ఉండేదనీ, అప్పటి సీపీఐ ఎమ్మెల్యేలు ఉప్పలపాటి రామచంద్రరాజు, తర్వాత కాలంలో కాకర్లపూడి సుబ్బరాజు చొరవతో విజయవాడ మేయర్‌గా టి.వెంకటేశ్వరరావు, అనాటి సీపీఐ స్థానిక కార్పొరేటర్లు తమ్మిన దుర్గారావు, తమ్మిన దుర్గా, సీపీఎం కార్పొరేటర్ సీహెచ్.బాబురావు, అప్పటి ఎంపీ సహకారంతో రైల్వే అధికారులతో మాట్లాడి ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారన్నారు. సీపీఐ నగర సహాయకార్యదర్శి నక్కా వీరభద్రరావు మాట్లాడుతూ పెరిగిన జనాభా ప్రకారం రెండో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని, అలాగే అండర్ గ్రౌండ్ బ్రిడ్జీ పనులను త్వరితంగా పూర్తి చేయాలని, వాంబేకాలని నుంచి మధురానగర్ వరకూ అండర్ గ్రౌండ్ లోబ్రిడ్జీ నిర్మాణం చేపట్లాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ భాస్కరరావు మాట్లాడుతూ ఇప్పటికైన సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ చూపి రెండో ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ తమ్మిన దుర్గ, యువజన సమాఖ్య నాయకులు లంకా గోవిందరాజులు, సీపీఐ స్థానిక నాయకులు కుచ్చర్లపాటి రామరాజు,కంది ఆదినారాయణ, యస్‌కె.సుభాని, వి.పాపారావు, కాళ్ల చిన్నప్ప, వెంకళ్ళి, రవికుమార్, యస్‌కె.బాషా, గుర్నాధం, డి.పుష్పా, యస్‌కె.నాగూర్, వి.కన్నారావు, సిహెచ్.గురవయ్య, టి.బ్రహ్మజీ, యండి.గౌస్, పి.నాగరాజు, డి.చిన్నా, యస్‌కె.బాషా, యస్‌కె.నాగూర్‌భీ, యస్‌కె.రహీం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో మైన్ డైమండ్ షో

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట): విజయవాడ లోని మలబార్ గోల్డెన్ డైమండ్‌లో "మైన్" డైమండ్ షోను విని యోగదారులు శ్రేయోభిలాషుల మధ్య వాసవ్య ఫిజియోథేరఫి డైరెక్టర్ అండ్ ఛీఫ్ ఫిజియోథెరపిస్ట్ సుదీప్తివర్ధన్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ డైమండ్ షోలో రోజు ధరించే నగలు వివాహ ఆభరణాలు లైట్ వెయిట్ ఆభరణాలు ప్లాటినం ప్లాటినం ఆభరణాలు పురుషుల ఆభరణాలు సముదాయాన్ని అందిస్తున్నారని అన్నారు. అనంతరం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మార్కెటింగ్ ఖాసిం మాట్లాడుతూ మెన్ డైమండ్ షో నేటి నుండి జూన్ 4వ తారీకు వరకు కొనసాగుతుందని పెళ్లిళ్లకు వధువులకు వరుడుకు కావలసిన వందలాది కలెక్షన్స్ మలబార్ గోల్డ్ అండ్ జ్యువెలరీలో ప్రదర్శిస్తున్నామని అన్నారు. తమ వినియోగదారులకు ధర, రాళ్ల బరువు,నికర బరువు, పారదర్శకతతో అభరణాల విలువ ఉంటుందని అన్నారు. పాత బంగారు ఆభరణాలు తిరిగించేటప్పుడు బంగారానికి బంగారం మార్కెట్ పై శూన్య తగ్గింపు నూరు శాతం ఐబిఎస్ హాల్ మార్క్ తో ధ్రువీకరించబడి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన ఆభరణాలు లభిస్తాయని అన్నారు.

ఉచిత యోగ శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగాలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డివీ.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4 తేది నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని తమ అసోసియేషన్ హాలులో ఈ శిక్షణా తరగుతులు జరుగుతాయని తెలియజేశారు. సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం ఈ శిక్షణా తరగతుల్లో సాధన చేయిస్తామని వివరించారు. శిక్షణను పూర్తి చేసిన వారికి అంతర్జాతీయ యోగా డే రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో టీ షర్ట్, సర్టిఫికెట్, జ్ఞాపిక, చక్కటి అల్పాహార విందు అందచేస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని తమ అసోసియేషన్ హాలులో నేరుగా కాని లేదా ఈ 80968 47053, 98485 89711 నెంబర్లల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా నాగేశ్వరరావు కోరారు.

హ్యూమన్ రైట్స్ కమిటీ కో కన్వీనర్‌గా రాజు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) మానవ హక్కుల కమిటీ కో-కన్వీనర్‌గా భవానీపురం, హెచ్‌బీ కాలనీకి చెందిన న్యాయవాది వి.ఎన్. రాజు నియమితుల య్యారు. ఈ సందర్భంగా అడ్వకేట్ రాజు మాట్లాడుతూ, మానవులందరికీ కులం, మతం, జాతి, భాష, ప్రాంతం, లింగ బేధాలు లేకుండా కొన్ని మౌలిక హక్కులు ఉంటాయని, ప్రతి వ్యక్తి తన పరిస్థితులతో సంబంధం లేకండా సమాజంలో ఒక సభ్యుడిగా అనుభవించే కనీస హక్కులనే మానవ హక్కులు అంటారని తెలిపారు. స్వేచ్ఛగా, హుందాగా జీవించే హక్కు, బానిసత్వం, హింస నుండి స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, విద్య హక్కు లాంటి మరెన్నో హక్కులు ఉన్నాయని, ఎక్కడైనా సరే మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. బీబీఏ ప్రెసిడెంట్ కె.బి.సుందర్, జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ పీ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ధూమవతి హోమం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సీవీఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జీ పక్కన ఉన్న శ్రీ దేవీ కారుమారి అమ్మన్ శక్తి పీఠంలో శనివారం జ్యేష్ఠ శుక్లపక్ష అష్టమి శ్రీ ధూమావతి పరదేవత ఆవిర్భావ తిథి సందర్భంగా శ్రీ ధూమావతి అమ్మ హోమం ఘనంగా నిర్వహించారు. గ్రహ దోషాలు, ఆర్థిక ఇబ్బందులు, దిష్టి పీడలు, (నరఘోష) ఇరుగుపొరుగు వారినుంచి ఎదురయ్యే ఇబ్బందులనుండి బాధితులు బయటపడి వూరట చెందడానికి ఈ హోమం ఎంతో దోహదపడుతుందనేది భక్తుల నమ్మకం. అందుకే ఈ ధూమావతి హెూమాలు నిర్వహిస్తుంటారు. శ్రీదేవీ కారుమారి అమ్మన్ పీఠంలో అంగరంగ వైభవంగా జరిగిన ఈ పూజా కార్యక్రమంలో శక్తీ పీఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు,జ్ఞానేశ్వర్, ఆలయ అర్చకులు దీక్షితులు, భక్తులు శ్రావణ కుమార్ చాముందేశ్వరి,లక్ష్మి నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్డీఎఐ ఆధ్వర్యంలో కలిసి వచ్చిన బీమా పరిశ్రమ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): 'అందరికీ బీమా' అనే ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యంలో భాగంగా, మిజోరాంలో బీమా చొచ్చుకుపోవడానికి భారతీయ బీమా పరిశ్రమ సమిష్టిగా కలిసి వచ్చింది. టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్, ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్నాయి. భారతదేశంలోని ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్ల నుండి జీవిత బీమా సంస్థలు, సాధారణ బీమా సంస్థల మద్దతు దీనికి ఉంది. ఐఆర్డీఎఐ నాయకత్వంలో వివిధ లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధుల కమిటీ రాష్ట్రంలో జీవిత బీమాపై అవగాహన కోసం కృషి చేస్తోంది. మిజోరాం ప్రభుత్వ కార్యదర్శి లాల్రామ్సంగ సాయిలో, ఐఆర్డీఎఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ గౌతమ్ కుమార్ నేతృత్వంలో మిజోరంలో ఒక సమావేశం జరిగింది. ఉమ్మడి పరిశ్రమ స్థాయి వాటాదారుల సమావేశంలో కామన్ సర్వీస్ సెంటర్స్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు చెందిన సీనియర్ అధికారులు, ఏజెంట్లు, బ్యాంక్ ప్రతినిధులతో సహా కీలక ప్రముఖులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకు సాధిస్తే ప్రభుత్వ పాలనలో అవకాశం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: యూపీఎస్సీ, సివిల్స్ చక్కటి ర్యాంకు సాధిస్తే, ఐఏఎస్ అధికారులుగా ప్రభుత్వ పాలనలో ఎంతో అభివృద్ధి చేసి ప్రజల్లో మంచి స్థానం సంపాదించే అవకాశం ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎం.జి. రోడ్డులోని ఎస్.ఎస్. కన్వెన్షన్లో ఏర్పాటుచేసిన ఎడ్యుకేషన్ సమ్మిట్లో భాగంగా శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో రూపొందించిన పాలిటీ అండ్ గవర్నెన్స్ పుస్తకాన్ని మంత్రి జోగి రమేష్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఒకప్పుడు ఐఏఎస్, ఐపీఎస్‌లో మంచి ర్యాంకులు సాధించేందుకుగాను యూపీఎస్సీ సివిల్స్ కోచింగ్ కోసం దిల్లీ, హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్లేవారని, కానీ నేడు మన రాష్ట్రం, విజయవాడలోనే మంచి శిక్షణా సంస్థలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెట్రోపాలిటన్ నగరాలతో పాటుగా ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో ర్యాంకులు వస్తున్నాయని తెలిపారు. ఐఎఎస్, ఐపిఎస్లుగా ప్రభుత్వ పాలనలో ఉద్యోగ అవకాశం సాధించిన వారు సమాజాభివృద్ధి చేయడంలో భాగస్వాములవుతారని తద్వారా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటీవలే విడుదలైన సివిల్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రత్యేక అతిథిగా పాల్గన్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎప్పటికపుడు విజ్ఞానాన్ని పెంచుకుంటూ ప్రణాళికా బద్ధంగా చదివితే ఐఎఎస్లో మంచి ర్యాంకు సాధించవచ్చని తెలిపారు. శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 51 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వవీరిలో రెండు తెలుగు రాష్ట్రాలలోని తెలుగువిద్యార్థులకు 19 ర్యాంకులు వచ్చాయని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికపుడు విజ్ఞానాన్ని అందించే విధంగా ప్రతి నెలా తమ అకాడమి ఆధ్వర్యంలో నిపుణులైన అధ్యాపకులచే స్టడీ మెటీరియల్ను రూపొందిస్తామన్నారు. ఈమెటీరియల్ను ఆవిష్కరించిన మంత్రి జోగిరమేషు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డికి అభినందనలు తెలిపారు.

మార్కెట్ విలువ పెంచే నిర్ణయం ఉపసంహరించుకోవాలి



విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుండి భూములు, స్థలాల మార్కెట్ విలువను పెంచే నిర్ణయం తీసుకోనుందని దీని వల్ల నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఈనిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని నరెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్) సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఎన్స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్‌కు శనివారం వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా నరెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షులు కె. ముక్తేశ్వరరావు మాట్లాడుతూ భూములు, స్థలాల మార్కెట్ విలువ పెంపును ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే భవన నిర్మాణ రంగం ఎన్నో సమస్యలతో సతమతమవుతుందన్నారు. ఇటీవల కరోనా మహమ్మారి కారణంగా భవన నిర్మాణ రంగంపై కుదేలైందని దీనితో ఇప్పుడు రేట్లు పెంచడం వలన నిర్మాణ రంగంపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో కార్మికులు కూడా వలస వెళ్లారని దీని కారణంగా నిర్మాణ రంగం పూర్తి స్థాయిలో కొనసాగే పరిస్థితి లేదన్నారు. ఇటువంటి స్థితిలో భూములు ధరలు పెరగడం వలన కొనుగోలుదారుడిపై కూడా భారం పడుతుందన్నారు. మన ప్రక్క రాష్ట్రాలలోని ప్రభుత్వాలు మార్కెట్ విలువను పెంచకుండా నిర్మాణ రంగానికి. రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం ఇస్తున్నాయన్నారు. ఈపరిస్థితుల్లో కూడా మన రాష్ట్ర ప్రభుత్వం ఈసంవత్సరానికి భూములు, స్థలాలపై మార్కెట్ విలువ పెంపుదలను వాయిదా వేయాలని కోరారు. అలాగే భవన నిర్మాణ రంగ సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలియచేయాల్సిందిగా ప్రభుత్వానికి తెలియచేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నరెడ్కో కోశాధికారి వేణు మాధవ్, సభ్యులు సందీప్ పాల్గొన్నారు.

లయోలా గ్రౌండ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర- విజయవాడ స్పోర్ట్స్: సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. లయోలా కళాశాల గ్రౌండ్స్ లో ఏడు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో దాదాపు ముప్పై జట్లు తలపడుతున్నాయి. కిరణ్ వీరమాచనేని నేతృత్వంలో జరిగే ఈ టోర్నమెంట్ ను సుజనా ఫౌండేషన్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సుజనా పౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్నామని, ప్రతియేడాది ఇదే వేసవిలో ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు కూడా క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభా పాటవాలతో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. తొలి రోజు మూడు మ్యాచ్ లు జరగ్గా అన్నీ ఏకపక్షంగా సాగాయి. నిర్ణత పది ఓవర్ల మ్యాచ్ లో అమరావతి సీసీ ఆరు వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేయగా, 52 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన శాండీ సీసీ జట్టు 4.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధించింది. మరో మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన టీం ఎలైట్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 134 పరుగులు సాధించింది. 135 పరుగుల భారీ చేధన కోసం బ్యాటింగ్ కు దిగిన అజార్ లామ్ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి కేవలం 42 పరుగులు మాత్రమే చేసింది. ప్రతి రోజూ మూడు మ్యాచ్ లు జరుగుతాయని జూన్ 1న సెమీస్, జూన్ 2న ఫైనల్ పోరు జరుగుతుందని టోర్నీ నిర్వాహకులు కిరణ్ వీరమాచనేని తెలిపారు.

మెరుగైన వైద్య సహాయం అందించండి: కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): జగ్గయ్యపేట సమీపంలోని ఎస్ఎల్ ఫార్మా కంపెనీలో పని చేస్తూ విషవాయువు బారిన పడిన బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. జగ్గయ్యపేట ఎస్ఎల్ ఫార్మా కంపెనీలో విషవాయువు ప్రమాదానికి గురై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎల్ కెమికల్ కర్మాగారాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎస్ఎల్ కెమికల్ కర్మాగారాన్ని నందిగామ ఆర్‌డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని, కర్మాగారాల డిప్యూటి ఇన్స్పెక్టర్, పొల్యుషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ అధికారులు కర్మాగారాన్ని పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ సంఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు అయితే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. విషవాయువుకు గురైన బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్య అధికారులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.

నందిగామ సీఐగా హనీష్‌బాబు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: నందిగామ సీఐగా జేఆర్‌కే హనీష్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం నందిగామ సీఐగా ఉన్న కే సతీష్‌ను వీఆర్(ఎవీస్బీ)కు పంపారు. ఈమేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హనీష్‌బాబు ప్రస్తుతం వీఆర్(ఎవీస్బీ)లో ఉన్నారు.

విశాలాంధ్ర ఎన్‌టీఆర్ జిల్లా

బైక్ తీసుకెళ్లి కాల్చేశారు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: బైక్ తీసుకెళ్లి కాల్చేసిన ఘటన శనివారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుడమేరు కట్ట ప్రాంతానికి చెందిన చల్ల నాగమల్లేశ్వరరావు ఆటో మొబైల్ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 26వతేదీ రాత్రి పనులు ముగించుకుని ఇంటి ముందు బైక్ పార్క్ చేసుకున్నాడు. తెల్లవారుజామున ఇంటి ముందు ఉన్న బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బైక్ కనిపించడలేదని ఫిర్యాదు చేశాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో తన బైక్ వెతుకుతుండగా రైల్వే కట్ట వద్ద పూర్తిగా దగ్ధమైన ఓ బైక్ కనిపించింది. నెంబర్ ప్లేట్ ఆధారంగా తన బైక్‌ను బాధితుడు గుర్తించాడు. గుర్తుతెలియని వ్యక్తులు బైక్ తీసుకెళ్లి రైల్వే కట్ట ప్రాంతంలో తగలపెట్టారని అజిత్ సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ కొత్తూరు తాడేపల్లిలోని మామిడి తోటలో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శనివారం దాడులు చేసింది. గుట్టుచప్పుడు కాకుండా పేకాట అడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14వేలు నగదు, ఏడు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకుని, విజయవాడ టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం పాయకాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వాంబేకాలనీకి చెందిన తమ్మిశెట్టి తిరుపతిరావు(21) శిరీషతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. తిరుపతిరావు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో తిరుపతిరావు ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పాయకాపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకట నారాయణ సతీమణి కస్తూరి కన్నుమూత

విశాలాంధ్ర-ఉయ్యూరు: దివంగత కామ్రేడ్ మండవ వెంకట నారాయణ సతీమణి కస్తూరి (92) శనివారం మృతి చెందారు. ఉయ్యూరు సమీపంలోని ఆమె స్వగ్రామం పెనమకూరులో మృతి చెందటంతో సీపీఐ నేతలు మృతదేహన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెంకటనారాయణ సహధర్మచారిణిగా, పార్టీ కోసం ఆమె పరితపించారని, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. కంకిపాడు సమితి అధ్యక్షులుగా వెంకటనారాయణ పనిచేశారన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో జిల్లా సీపీఐ ఇన్‌చార్జి కార్యదర్శి తాతయ్య, సీనియర్ నేత మేరుగు విజయ్‌కుమార్, నేతలు మిక్కిలినేని రాధాకృష్ణ, యలమంచిలి వెంకటేశ్వరరావు, పాశం రవి, మరీదు శ్రీనివాసరావు ఉన్నారు.

మట్టి తరలింపు వాహనాలపై జరిమానా

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలకు జరిమానా విధించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని నరసాపురం గ్రామంలోని చెరువు నుంచి శుక్రవారం రాత్రి మట్టి తరలింపు చేపట్టగా సిబ్బంది దాడి చేసి పట్టుకున్నట్లు వివరించారు. ఈ దాడిలో పట్టుబడిన పొక్లెయిన్‌కు రూ.10వేలు, రెండు ట్రాక్టర్లకు రూ.5వేలు చొప్పున జరిమానా విధించామని డిప్యూటీ తహశీల్దారు మోతియా వివరించారు.

పుస్తక పఠనం అలవర్చుకోండి

విశాలాంధ్ర-తిరువూరు: విద్యా ర్థులు సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా పుస్తకం చదవడం అల వర్చుకోవాలని తిరువూరు శాఖ గ్రంథాలయ అధికారి పద్మావతి సూచించారు. స్థానిక శాఖ గ్రంథా లయంలో శనివారం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పుస్తక పఠనం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఒకసారి చదివితే ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా పుస్తక పఠనం ఉపకరిస్తుందని, మెదడుకు పదును పెట్టే ఎన్నో అంశాలు విజ్ఞాన గ్రంథాల్లో ఉంటాయని పద్మావతి తెలిపారు. నిరంతరం పుస్తకాలు చదివేవారు అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. రోజూ వార్త పత్రికలు చదివితే ప్రపంచ విజ్ఞానం తెలుసుకోవచ్చని తెలిపారు. చిత్రలేఖనం, హిందీ, సైన్స్, క్రాఫ్ట్ సబ్జెక్టులపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు.

పీవీపీలో చెస్ వర్క్‌షాప్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: స్థానిక గ్లోబల్ చేస్తా అకాడమీ ఆధ్వర్యంలో నగరంలోని పీవీపీ మాల్‌లో చెస్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ చెస్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎస్ కే కాసిమ్ తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి ప్రతి శని, ఆదివారాలలో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో ఇప్పటివరకు 2000 మంది క్రీడాకారులకు చదరంగంలో మెలకువలను ఆడే విధానాన్ని, లోపాలను, ఆటపట్ల వారికున్న సందేహాలను నివృత్తి చేసినట్లు ఖాసీమ్ తెలిపారు. చదరంగం నేర్చుకోవడం వలన తెలివితేటలు పెరుగుతాయన్నారు. ఈ చెస్ వర్క్ షాప్ లో ప్రముఖ న్యాయవాది ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు తాడిగడప లోని ఎస్‌టిబిఎల్ కాలనీలో అంగరంగ వైభవంగా జరిగాయి. మూడోరోజు శనివారం స్వామి వారికి సహస్ర కలశాభిషేకం సేవ జరిగింది. 1008 కలశాల నిండా నీరు నింపి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కి అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రాలు, సన్నాయి మేళాల మధ్య స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం దివ్య తిరు మహా కల్యాణోత్సవం కూడా నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమాలు, ప్రత్యేక ఆరాధనలు కూడా నిర్వహించడం, స్వామికి విశేష అలంకరణ చేశారు. ఆదివారం సుమారు 2000 మందికి అన్నదానం నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులు సీతారాణి, భారతి ప్రసాద్, సుబ్బయ్య శర్మ, రామకృష్ణ, శేష ఫణి, విశ్వనాథ్, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయము - చందర్లపాడు

ఆర్.సి.నెం.13/2023/ఏ తేది : 26-05-2023

ఎన్‌టీఆర్‌జిల్లా చందర్లపాడు మండలము పరిధిలోని ఈ దిగువ తెలిపిన ఫెర్రీలకు 2023-2024 సం.లకు (అనగా 12 నెలలకు) కాలమునకు కృష్ణానదిపై పడవలు/బల్లకట్టు త్రిప్పి సుంకం వసూలు చేయుటకు గాను ది.29.05.2023వ తేదీ సోమవారము మండల పరిషత్ కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడును.

1 ఉస్తేపల్లి-చింతపల్లి — ఉదయం 11.00 గంటలకు.
2. గుడిమెట్ల -పూట్లగూడెం — మధ్యాహ్నం 12.00 గంటలకు
3. వెలది - కస్తాల — మధ్యాహ్నం 01.00 గంటలకు
4. పున్నపల్లి - కోసూరు — మధ్యాహ్నం 02.00 గంటలకు
5. పోపూరు - పొందుగుల — మధ్యాహ్నం 3:00 గంటలకు.
6. కాసరబాద- కొత్తపల్లి — మధ్యాహ్నం 3.30 గంటలకు

కె.జ్యోతి
మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, చందర్లపాడు